క్లుప్తంగా

రేపటి నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడులో వెలసిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి 14వ ఆరాధనోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మధుసూదనాచారి, సుదర్శనాచారులు తెలిపారు. ఉదయం 6 గంటలకు పుణ్యాహవచనం, అభిషేకం, అనంతరం మంగళహారతి, పంచామృతాభిషేకం, తీర్థప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. 18న ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, 6 నుంచి 8 గంటల వరకు మండపారాధన, 8 గంటల నుంచి 10 గంటల వరకు స్వామివారి పూజా కార్యక్రమాలు ఉంటాయి. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. 19న జిల్లా స్థాయి కాడెద్దుల బలప్రదర్శన పోటీలు, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయని, 18న ఎంట్రీ ఫీజులు చెల్లించి నమోదు చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆలయానికి బంగారం వితరణ



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ధరూరు మండలంలోని గార్లపాడుకు చెందిన ధర్మారెడ్డి, జయమ్మ దంపతులు అరతులం బంగారం విరాళంగా బుధవారం ఆలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అయిజ: రోడ్డు ప్రమాదంలో బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయభాస్కర్ వివరాల ప్రకారం.. అయిజ పట్టణం ఎస్సీ కాలనీకి చెందిన బీఎం ఆంజనేయులు పట్టణంలోని ఠాగూర్ పాఠశాల సమీపంలో బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన ఆంజనేయులుగౌడ్ ద్విచక్ర వాహనంపై అదే రోడ్డుపై వస్తున్నాడు. రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. బీఎం ఆంజనేయులు తలకు గాయం కావడంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. తూంకుంట ఆంజనేయులు గౌడ్ ముఖానికి గాయమైంది. పెదవి చీలిపోవడంతో అతడిని కర్నూల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి అర్చకులు ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు బిస్కెట్స్, చాక్లెట్స్ అందజేత



కేటీదొడ్డి: వేసవి కాలంలో విద్యార్థులు ఎండలకు తిరగకుండా సమ్మర్ రెమెడియల్ సెంటర్‌కు వచ్చి క్రమ శిక్షణతో చదువుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చ అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గువ్వలదిన్నె విద్యార్థులకు చదువుకోవడానికి ప్రోత్సహిస్తే మంచినీటి సౌకర్యార్థం మట్టి కుండ ఏర్పాటు చేసి విద్యార్థులకు బిస్కెట్స్, చాక్లెట్స్ ప్యాకెట్లు అందజేశారు. మన గ్రామంలోని యూత్ సెంటర్లు నడపడం ఓ గొప్ప నిర్ణయం అని విద్యార్థులు ఎండలకు తిరగకుండా రెమెడియల్ సెంటర్‌కు వచ్చి చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ ఫౌండేషన్ యువకులు ఉన్నారు.

వేసవి క్రీడల క్యాంపుల ఏర్పాటులో వివక్ష

వీపనగండ్ల: జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడల క్యాంపుల ఏర్పాటులో కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మూడు మండలాలను ఎంపిక చేయకపోవడంతో పలువురు క్రీడాకారులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, యోగా తది తర వాటిలో వనపర్తి నియోజకవర్గానికి చెందిన మండలాలనే ఎంపిక చేసి వీపనగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్ మండలాలను ఏ ఒక్క క్రీడకు ఎంపిక చేయలేదని వాపోయారు. కొన్ని మండలాల్లో ఒకటి, రెండు క్రీడలకు సంబంధించిన క్యాంపులను కూడా ఏర్పాటు చేశారు.

ప్రతిపాదనలకే పరిమితమా?

- ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణం లేక అవస్థలు
- గుంతలమయంగా రోడ్లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



చెన్నిపాడు - మానవపాడు వెళ్లే రోడ్డు మార్గం

మానవపాడు: ఏళ్ల తరబడి రోడ్ల నిర్మాణం పనులు చేపట్టక పోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్ల నిర్మాణాలు కేవలం ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. రోడ్లపై ప్రయాణం చేయలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏళ్ల తరబడి నిర్మాణం చేపట్టక, ఎన్నికల ముందు రోడ్ల నిర్మాణంపై రాజకీయ నాయకులు హామీలకే పరిమితమవుతున్నారు. మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు, మండలాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రం నుంచి చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చండూరు, బోరవెల్లి, పల్లెపాడు గ్రామాల మధ్య రోడ్లు గుంతలుగా ఉన్నాయి. బీటీ రోడ్లు ధ్వంసమై పెద్దపెద్ద గుంతలుగా ఏర్పడి వాహనాదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మార్గాల గుండా ప్రయాణించాలంటే నరక ప్రాయంగా మారిందని పలువురు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపై గుంతలు కన్పించక నిత్యం ప్రమాదాలు సంభవిస్తుండడంతో ప్రాణాలు అరచేతిల్లో పెట్టుకోని ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే అవస్థలు..

మానవపాడు మండల కేంద్రానికి ప్రధాన రహదారి, ఈ దారి గుండా ప్రయాణించాలంటే గుంతల రోడ్లు ఉన్నాయి. వర్షాలు పడితే నీటి కుంటలను తలపిస్తాయి. రవాణా సౌకర్యార్థం, ఆరోగ్యం కోసం, పాఠశాలలకు బస్సు సౌకర్యం కోసం, ఆటోలు, వాహనాలు ఈ దారిలోనే కర్నూల్, అలంపూర్ చౌరస్తాకు వెళ్తుంటాయి. పదేళ్లుగా మానవపాడు, చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, అమరవాయి, పెద్దఆముదాపాడు, నారాయణపురం గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డు ద్వారానే ప్రయాణిస్తుంటారు. ప్రమాదాలు జరగకముందే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి నిరీక్షణ



రోడ్ల నిర్మాణం కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. రోడ్లపై గుంతలు ఏర్పడడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చెన్నిపాడు–మానవపాడు రోడ్డుమార్గం ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమాయల్లో, గుంతల రోడ్లల్లో ప్రయాణించాలంటే భయాందోళనకు గురవుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– పోషిరెడ్డి, మానవపాడు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..



రోడ్ల నిర్మాణం సరిగా లేక రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోరా? కలుకుంట్ల నుంచి మద్దూరుకు వెళ్లే రోడ్డు మార్గం కలుకుంట్ల బ్రిడ్జి దగ్గర వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నాం.

– ఆత్మలింగారెడ్డి, కలుకుంట్ల

టెండర్ ప్రక్రియ పూర్తి కావాలి

రోడ్లపై గుంతలు ఏర్పడిన విషయం వాస్తవమే. నిధులు విడుదల కాగానే మరమ్మతు పనులు ప్రారంభిస్తాం. మానవపాడు నుంచి చెన్నిపాడు మీదుగా పోతులపాడు స్టేజీ వరకు రోడ్డుకు రూ.4కోట్లు, కలుకుంట్ల నుంచి అమరవాయి గ్రామానికి వెళ్లే రోడ్డుకు రూ.3.40లక్షలకు టెండర్ వేశారు. ఎవరూ ముందుకు రావడం లేదు. నిధులు మంజూరైన వెంటనే గుంతలు పూడ్చి ప్రమాదాలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటాం.

– మహేష్, ఆర్అండ్‌బీ మానవపాడు

ప్రజలకు అందుబాటులో ఉంటాం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజవకర్గంలోని ప్రజలకు సేవలందించడానికి నిరంతరం అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీని బుధవారం బాధితులకు అందజేశారు. ఉండవెల్లి మండలం మారమునగాల గ్రామానికి చెందిన జగన్‌మోహన్ గౌడ్ వైద్యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఓసీ వచ్చినట్లు తెలిపారు. ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యుడు రాకేష్‌కు అందజేశారు. వీరితో పాటు వావిలాల రంగారెడ్డి, సంకాపురం రాముడు, రఘు రెడ్డి, మహేష్ ఉన్నారు.

కృష్ణయ్య సేవలు మరువలేనివి



కృష్ణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గద్వాల అర్బన్: ఏఐటీయూసీ కార్మిక ఉద్యమ నేత ఎంబీ కృష్ణయ్య సేవలు మరువలేనివని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కొనియాడారు. కృష్ణయ్య నాల్గొ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండు, నల్లకుంటలోని హమాలీ కార్మికుల అడ్డా వద్ద ఎంబీ కృష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కార్మిక ఉద్యమ నేతగా కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు చేశారని తెలిపారు. కార్మికులందరు ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆశన్న, శంకర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గిరిరాజు, రాంనాథ్, హమాలీ యూనియన్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలి



ఉండవెల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉపాధి హామీ కూలీలు పే స్కేలు ఇవ్వడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, అధికారుల నిర్లక్ష్యంతోనే కూలీలకు పే స్కేలు ఇవ్వడం లేదని తెలిపారు. టీపీ రామచంద్రుడుకి ఉపాధి హామీ కూలీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రేపల్లే దేవదాసు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి



ఫేర్‌వేల్ డేలో అధ్యాపకులతో విద్యార్థులు

గద్వాల అర్బన్: బాగా చదివి విద్యావంతులుగా ఎదిగి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా ఆకాంక్షించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ లైఫ్ సైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫేర్‌వేల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. పట్టుదలతో లక్ష్యాన్ని నిర్దేశించుకోని వాటిని సాధించే దిశగా కష్టపడి చదవాలన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమా లు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, అధ్యాపకులు కృష్ణమూర్తి, హరిబాబు, కరుణాకర్, వెంకటేశ్వరమ్మ ఉన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు గురుకుల, నవోదయ కోచింగ్ పేరుతో కోచింగ్ సెంటర్లు నడుపుతున్నారని, కొన్ని ప్రైవేట్‌గా వసతి గృహాల్లో కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని భీంనగర్‌తో పాటు వివిధ మండలాల్లో కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్ల యాజమానులపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదంటే కలెక్టర్, ఎస్పీ దృష్టికి తెస్తామన్నారు.

వాల్‌పోస్టర్లు విడుదల



గద్వాల అర్బన్: మిస్పా, ఒలీవ, సియోను, ఎంబీ చర్చిల సహకారంతో గురువారం నుంచి ఈనెల 19 వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని కేఎస్ ఫంక్షన్ హా ల్లో నిర్వహించనున్న ఎంబీ కన్వెన్షన్ (మహాసభలు) సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత విడుదల చేశారు. కార్యక్రమంలో మిస్పా, ఒలీవ, సియోను, ఎంబీ సంఘాల సభ్యులు మాణిక్యం, అబ్రహం, విజయభూషణ్, ప్రభుదాస్, రవిప్రకాష్, భాస్కర్ ఉన్నారు.

గట్టు ఎంఈఓగా నర్సింహులు



గట్టు: మండలంలో ఎంఈఓగా నర్సింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివర కు ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించిన కొండారెడ్డి గత నెలలో పదవీ విరమణ చేశారు. వడ్డేపల్లి ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తూనే, రాజోళి, అయిజ మండలాలకు ఇన్‌చార్జిగా వ్య వహరిస్తున్న నర్సింహులుకు గట్టు మండలం బాధ్యతలు కూడా అప్పగించారు. పీఆర్‌టీ యూ శాఖ మండల అధ్యక్షుడు రంగన్న, ప్రధా న కార్యదర్శి వెంకటేష్‌లు ఎంఈఓగా బాధ్య తలు చేపట్టిన నర్సింహులును సన్మానించారు. కార్యక్రమంలో ఓబులేష్, రాంబాబు, కులదిప్ నయ్యర్, విక్రమసింహాచారి, శరణప్ప, వీరేష్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఐడియా అదుర్స్..



అమరచింత: వేసవి ఎండల నుంచి రక్షణ పొందేందుకు ఓ ద్విచక్ర వాహనదారుడు వినూత్నంగా ఆలోచించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. తన ద్విచక్రవాహనానికి పైభాగంలో ఒక స్టాండును ఏర్పాటు చేసి ముఖానికి వేడి తగలకుండా ఫైబర్ గ్లాసు బిగించడంతో పాటు ఎండ నుంచి కాపాడేలా గొడుగులా ఓ రేకును అమర్చాడు. దీంతో వడగాలితో పాటు ఎండ వేడి నుంచి రక్షణ లభిస్తుందని వాహనదారుడు తెలిపాడు. అమరచింత మీదుగా మరికల్ వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు స్థానిక బస్టాండ్ రహదారిపై వెళ్తుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

ఘనంగా శేషదాసుల రథోత్సవం



మల్దకల్‌లో శేషదాసుల వారి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



మల్దకల్‌లో మహిళా భక్తులు భజనలు

మల్దకల్: మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శేషదాసుల వారి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం దాసుల వారి ఉత్సవమూర్తులను రథంపై భాజాభజంత్రీలతో ఊరేగించారు. అంతకు ముందు అభిషేకాలు, హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన బ్రాహ్మణులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కర్ణాటకకు చెందిన మహిళా భజన మండలి సభ్యులతో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు దాసుల వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, శేషదాసుల వారి వంశస్థులు ధీరేంద్రదాసు, రాఘవేంద్రదాసు, విష్ణుదాసు, శశాంకదాసు, శేషగిరిరావులతో పాటు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, ముకుందరావు, బాబురావు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ, ఈదమ్మ ఉత్సవాలు



కోతులగిద్దలో పూజల్లో పాల్గొన్న నాయకులు

ధరూరు: మండలంలోని కోతులగిద్దలో బుధవారం పెద్దమ్మ, ఈదమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఊరంతా ఉత్సవంలా చేశారు. గ్రామానికి ఆడ పడుచులు, బంధువులు చేరుకోవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి హాజరు కాగా, వారిని కాంగ్రెస్ నాయ కులు శ్రీనివాసరావు, మాజీ సర్పంచు రంగన్న, కేబీ గోవిందులు శాలువా పూలమాలతో సన్మానించారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఐదు రోజుల ఉపాధి కూలీ రూ.25!



ఉపాధి అధికారితో మాట్లాడున్న కూలీలు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన వంశీ ఉపాధి పనికి ఐదు రోజులు వెళ్లాడు. ఐదు రోజులకు మొత్తం డబ్బులు రూ.25 వచ్చాయి. బుధవారం మండలంలోని చెన్నిపాడులో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ మేట్లతో సమావేశం నిర్వహించారు. ఐదు రోజులకు రూ.25 రావడంతో అధికారులతో ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం కూలీలు సమస్యలను టెక్నికల్ అసిస్టెంట్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణస్థాయిలో ఉపాధి పనికోసం మహిళలు, వృద్ధులు, భర్త లేనివారు వెళ్తుంటారని, వారు ఒక్కొక్కరు 5మీటర్లు గుంతలను తవ్వుతారా? అంటూ ప్రశ్నించారు. ఈ సంవత్సరం ఎండలు, వేడి తీవ్రత విపరీతంగా ఉంది. కూలీలకు టెంట్లు ఏర్పాటు చేశారా? ఎండ తీవ్రతతో వృద్ధులు, మహిళలు దాదాపు 3 కిలోమీటర్లు కాలినకన నడిచి వెళ్తున్నారని, వారికి రవాణా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఆయా గ్రూపులకు సంబంధించి మెడికల్ కిట్లు అందించడం లేదన్నారు. వారానికి కేవలం రూ.45 మాత్రమే కూలీ వస్తోంది, ఆశించిన స్థాయిలో డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధికూలీలకు సంబంధించి కూలీ డబ్బులు ఎక్కువ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధికూలీలు కోరుతున్నారు.

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

ధరూరు: యువత బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ విజయ్‌కుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలం లోని భీంపురంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ విలవైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటిని ఉత్పత్తి, రవాణా, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో కల్తీ కల్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి కుటుంబాలను అతలాకుతలం చేసుకుంటున్నారన్నారు. గుట్టు చప్పుడు కాకుండా గంజాయి రవాణా చేసే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారి సమాచారం అందించాలని, వివరాలు చెప్పిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. కల్తీ కల్లు, గంజాయి వాటిల్లే కలిగే నష్టం తెలిపే పోస్టర్‌ను విడుదల చేశారు.

గీత కార్మికులకు చేయూత ఏది?

- గద్వాల నియోజకవర్గంలో 4664మంది కార్మికులు
- ఇబ్బందులు పడుతున్న గీత కార్మిక కుటుంబాలు



మల్దకల్ శివారులో ఈతచెట్టుకు కల్లుగీస్తున్న గీత కార్మికుడు

మల్దకల్: తరతరాలుగా గీత కులవృత్తిపై ఆధారపడి జీవించే గీతకార్మికులకు ప్రభుత్వ చేయూత అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గద్వాల నియోజకవర్గంలోని 5 మండలాల్లో మొత్తం 4664మంది గీత కార్మికులు గీతవృత్తిపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారి వృత్తి కల్లుగీయడం ఆయా గ్రామాలకు తరలించి అమ్ముకోవడం, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకోవడం దిన చర్యగా మారింది. ఇటీవల కాలంలో వారి వృత్తికి అన్ని అవరోధాలే ఏర్పడటంతో గీత కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో ప్రభుత్వం గీత వృత్తిపై ఆధారపడి జీవించే వారిని అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూ పంపిణీతో ఆటంకం

గత ప్రభుత్వంలో గ్రామాల్లోని నిరుపేదలకు ప్రభుత్వ భూములు పంచింది. దీంతో వారు బంజారు భూములను సాగు చేస్తున్నారు. గతంలో ఉన్న ఈత చెట్లను తీసివేయడంతో కల్లు తీయడానికి అవకాశం లేకుండా పోతోంది. గతంలో వేల మంది గీత కార్మికులు ఈ వృత్తిపై ఉపాధి పొందేవారు. ప్రస్తుతం వారి సంఖ్య రోజురోజుకు పడిపోతుందని గీతకార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం ఈత వనాలు పెంచేందుకు ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి అందులో మొక్కలు నాటుకునేందుకు అవకాశం కల్పించాలని గీత కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రూ.4వేల పింఛన్ ఇవ్వాలి



నేను చిన్నప్పటి నుంచి కల్లు గీస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. 40ఏళ్లుగా వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఆరోగ్య పరిస్థితి అంతంతేగా ఉంది. చెట్లు ఎక్కి కల్లుగీయలేను. ప్రభుత్వం రూ.4వేల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి.

– ఆంజనేయులుగౌడ్, పెద్దొడ్డి

గీత కార్మిక సంఘాలకు శాశ్వత లైసెన్స్‌లు ఇవ్వాలి



గీత కార్మిక సంఘాలకు శాశ్వత లైసెన్స్‌లు ఇవ్వాలి. ప్రమాదవశాత్తు గీత కార్మికులు మృతి చెందితే ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఈత చెట్లు పెంచుకునేందుకు ఐదెకరాల భూమితో పాటు నీళ్లు, వాటి సంరక్షణకు నిధులు మంజూరు చేయాలి.

– రవీందర్‌గౌడు, మల్దకల్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



గీత కార్మిక సంఘాలకు ఐదెకరాల భూమితో పాటు మృతి చెందిన గీత కార్మికులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి ఈత, తాటి చెట్లు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. గీత కార్మికులకు అన్ని విధాలుగా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

– గణపతిరెడ్డి, ఎక్సైజ్‌సీఐ, గద్వాల